ఇంత అధ్వానమా..!

• బురదలో కూరుకుపోయిన విద్యార్థుల స్కూల్ వాహనం

బురదలో కూరుకుపోయిన వాహనాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు

చెన్నూర్ రూరల్, ఆగస్టు 30 : చెన్నూర్ మండలం తుర్కపల్లిలోని రోడ్డు అద్వానంగా తయారైంది. ప్రయాణం నరకప్రాయంగా మారింది. శుక్రవారం ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో చెన్నూర్‌కు వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం బురదలో కూరుకుపోయింది. విద్యార్థుల తల్లిదండ్రులు పరుగుపరుగున అక్కడికి చేరుకొని వాహనాన్ని బయటకు తీశారు. అధికారులు స్పందించి తుర్కపల్లి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ధామాషా పద్ధతిలో వర్గీకరణ చేయాలి

లక్షెట్టిపేట, ఆగస్టు 30 : జనాభా ధామాషా పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చట్టబద్ధత లేనిదన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుటుంబీకులు మాల ఉపకులాలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే నెల 2, 11, 16, 27 తేదీల్లో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న సచివాలయ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుందారపు నారాయణ, అల్తాటి నర్సయ్య, చంద్రయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

జైనూర్ ఆగస్టు 30 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంచాయతీల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లోని వార్డుల వారీగా ఓటరు జాబితాను సెప్టెంబర్ 6వ తేదీలోగాసిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జైనూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నిర్వహణపై సమావేశం

కాసిపేట, ఆగస్టు 30 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, సాధారణ ఎన్నికల్లో భాగంగా జీపీల వారీగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ తయారు చేసి టీ పోల్‌లో నమోదు చేసేందుకు రెడీ ఉండాలని సూచించారు. పారిశుధ్య పనులు నిరంతరంగా చేయాలని, క్లోరినేషన్ చేయాలని, వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ అలీ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ మున్సిపాల్ సాధారణ సమావేశం

చెన్నూర్, ఆగస్టు 30: చెన్నూర్ మున్సిపాల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అర్చనాగిల్డా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, తగు నివారణ చర్యల గురించి సభ్యులు చర్చించారు. అలాగే పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులపై సభలో చర్చించి ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు పోగుల సతీశ్, కమ్మల శ్రీనివాస్, వేల్పుల సుధాకర్, రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీనివాస్, జోడు శంకర్, దోమకొండ అనిల్, మేడ స్రవంతి, తుమ్మ రమేశ్, నాయిని శ్యామల, కో–ఆప్షన్ సభ్యులు ఆఫ్రీన్, ఆయూబ్ పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

జైనూర్, ఆగస్టు 30 : జైనూర్ మండలం గౌరీ కొలాంగూడ గ్రామానికి చెందిన సీడాం రాము తన వ్యవసాయ పంట పొలంలో సాగు చేస్తున్న 30 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ డీ సాగర్ తెలిపారు. సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. సిడాం రామును అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్క్రాప్ దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

గంజాయి మొక్కలను సీజ్ చేస్తున్న ఎస్ఐ డీ సాగర్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంసీసీ కంపెనీలో స్క్రాప్ దొంగతనం చేసిన రాజీవ్‌నగర్‌కు చెందిన గుమ్మడి సారయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. ఎంసీసీ కంపెనీలో శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో స్క్రాప్ దొంగతనం జరిగిందని సెక్యూరిటీ ఇన్‌చార్జి కైష్టుదాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బెల్లంపల్లి చౌరస్తాలో సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న గుమ్మడి సారయ్యను అదుపులోకి తీసుకొని, విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరిపై కేసు

మద్యం మత్తులో వీరంగం సృష్టించి, ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేసిన మంచిర్యాలకు చెందిన వసాక పున్నంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతిగా మద్యం తాగిన పున్నం.. మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేశాడు. ఆర్టీసీ కంట్రోలర్ పోలీసులకు సమాచారం అందించారు. పున్నంను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ సందర్శన

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 30 : కాగజ్‌నగర్‌లోని కేజీబీవీని శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దాసరి వేణు సందర్శించారు. తరగతి గదులు, భోజనశాల, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

పశువులకు పేడ పరీక్షలు

భీమారం, ఆగస్టు 30 : దాంపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన కొందరు రైతుల పశువుల పేడను శుక్రవారం ఆదిలాబాద్ రోగ నిర్ధారణ కేంద్రం వైద్యాధికారి సతీశ్ పరీక్షించారు. పశువులు వారం నుంచి విరేచనాల భారిన పడగా, పరీక్షలు చేసి, మందులు అందించారు. ఇందులో మండల పశువైద్యాధికారి రాకేశ్ శర్మ, సతీశ్, గోపాల మిత్ర సంపత్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్, ఆగస్టు 30 : కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఈజ్‌గాం విలేజ్ నంబర్01కు చెందిన రాజ్‌కుమార్ సర్కార్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ శుక్రవారం తెలిపారు. రాజ్‌కుమార్ సర్కార్ పలువురికి గంజాయి విక్రయించే సమయంలో కొనుగోలు చేసిన వారితో పాటు పట్టుకొని పోలీసు స్టేషన్ తరలించినట్లు స్పష్టం చేశారు.

క్వార్టర్లకు ఇంటి నంబర్లు ఇవ్వండి

• మున్సిపాలిటీ ఆదాయం సమకూర్చుకోండి
• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
• రసాభాసగా బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఆగస్టు 30 : ప్రభుత్వానికి అప్పగించిన బెల్లంపల్లిలోని సింగరేణి క్వార్టర్లకు ఇంటి నంబర్లు కేటాయించి, మున్సిపల్ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సాధారణ సమావేశం రసాభాసగా జరిగింది. సమావేశానికి కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యులు సమస్యలను ఏకధాటిగా సభ దృష్టికి తీసుకెళ్లగా, చర్చ వాడీవేడిగా సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన విధంగా కేటాయించి మున్సిపాలిటీని అభాసుపాలు చేయకుండా సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి, పకడ్బందీగా క్వార్టర్లకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారు, సింగరేణి క్వార్టర్లలో నివసిస్తున్న వారు దళారులను నమ్మకుండా నేరుగా కార్యాలయంలో సంప్రదించి, నిబంధనల మేరకు నంబర్లు పొందాలని సూచించారు. ఒక అంతస్తుకు ఆస్తి పన్ను చెల్లించి మిగతా అంతస్తులకు చెల్లించడం లేదని, తన దృష్టికి వచ్చిందని, అన్ని అంతస్తులకు కూడా అధికారులు పన్ను వసూలు చేసి, మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కాగా, పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని, ఎన్నిసార్లు విన్నవించినా అధికారులకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రడగంబాల బస్తీ రాతి కుంట చెరువు నీటిని రైల్వే ట్రాక్ వైపు కాకుండా చెరువు వెనుక వైపునకు మళ్లించాలని, మరోసారి లోతట్టు ప్రాంతాలు వరద బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కౌన్సిలర్ నెల్లి శ్రీలత కోరారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్టాళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, కలెక్టర్ తొమ్మిది మందిని అనర్హులుగా ప్రకటించినా వారిస్థానాల్లో మరో ఏడుగురిని తీసుకున్నారని వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు రాము నాయక్, బొడ్డు నారాయణ, గడ్డం అశోక్, గోసిక రమేశ్, షేక్ ఆస్మా, అనిత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎజెండాలో పొందుపర్చిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

పాఠశాలలు, కళాశాల సందర్శన..

మండల శివారులోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వసతి గృహంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి..

నస్పూర్, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయకర్త నాగేశ్వర్‌రావు, జోనల్ అధికారి అరుణకుమారితో కలిసి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లు, భవన యాజమానులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు, నాణ్యమైన విద్యాబోధన, క్రీడారంగంలో తర్ఫీదు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భవనాలకు యాజమానులు సమన్వయంతో మేజర్, మైనర్ మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ, నల్లా కనెక్షన్లు, విద్యుత్ ఇతర సౌకర్యాలను కల్పించుకోవాలని వారికి సూచించారు.

చంటి బిడ్డతో మున్సిపల్ సమావేశానికి..

చంటిపాపతో హాజరైన కౌన్సిలర్ భరద్వాజ్ సుకేశిని

బెల్లంపల్లి, ఆగస్టు 30 : 30వ వార్డు కౌన్సిలర్ భరద్వాజ్ సుకేశిని చంటి బిడ్డతో కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ప్రజలు జ్వరాల బారినపడి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమావేశానికి వచ్చి, సమస్యలను విన్నవించారు. సుమారు 4 గంటలపాటు, సాగిన సమావేశంలో పాప ఏడుస్తున్న సమయంలో పాలు పట్టించి, బుజ్జగిస్తూ పాల్గొన్నారు. పలువురు కౌన్సిలర్లు ఆమెను అభినందించారు.

పైసలిస్తేనే పట్టా చేస్తారా..?

కన్నెపల్లి, ఆగస్టు 30 : కన్నెపల్లి తహసీల్ కార్యాలయంలో పైసలిస్తేనే భూ పట్టా చేస్తారా..? లేకపోతే చేయరా..? అని కన్నెపల్లి గ్రామానికి చెందిన పోలాజీ మొండి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించాడు. తన మామయ్య పందిల్ల జయరాం పేరిట సర్వే నంబర్ 86/ఆ/1లో 8 గుంటల భూమి ఉన్నదని తెలిపాడు. ఇందులో నుంచి 4 గుంటల భూమిని తన పేరు మీద పట్టా చేయాలని గత నెల 24న కన్నెపల్లి తహసీల్దార్ వెంకట శ్రావణ్‌కుమార్‌ను సంప్రదించానని, 4 గుంటల భూమి పట్టా చేయలేమని చెప్పారని పేర్కొన్నాడు. పట్టా చేసేందుకు ఎలాంటి జీవోలు లేవన్నారని తెలిపాడు. కానీ, శుక్రవారం ముగ్గురు వ్యక్తులకు రెండున్నర గుంటల చొప్పున తహసీల్దార్ పట్టా చేశారని, ఇది ఎలా జరిగిందని, తహసీల్ కార్యాలయంలో డబ్బు ఇచ్చిన వారికే పట్టాలు చేస్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద రైతులకు న్యాయం చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకు వచ్చారని, కొందరు అధికారుల నిర్ణయాలతో పేద రైతులం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటశ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా, తనను పొలాజీ మొండి కలువలేదని తెలిపారు. గుంటల్లో ఉన్న బూమిని 20 రోజుల నుంచి రిజిస్ట్రేషన్ చేస్తున్నామని వెల్లడించారు. చూసుకుంటూ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. రైతు మొండి తనను సంప్రదిస్తే పట్టా చేస్తామని వెల్లడించారు.

వ్యాధులపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ అన్నారు. దిశా కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షల కోసం జిల్లాలోని పల్లె దవాఖానాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు కలెక్టరేట్‌లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలు చేయనున్నట్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధాకర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డా.ప్రసాద్, డా.సీతారామరాజు, డా.ఎస్ అనిత, డా.అనిల్, డీపీవో ప్రశాంతి, ఎయిడ్స్ జిల్లా అధికారి నీలిమ రాజేశ్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నిర్ధారణ చేసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 30 : అర్హత కలిగి రుణమాఫీ కాని రైతులు త్వరగా తమ కుటుంబాన్ని నిర్ధారణ చేసుకోవాలిని మంచిర్యాల జిల్లా వ్యవసాయాధికారి కల్పన సూచించారు. మండలంలోని ఆకెనపల్లిలో నిర్వహించిన రుణమాఫీ నిర్ధారణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్, ఏఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

సీసీసీ నస్పూర్, ఆగస్టు 30 : శ్రీరాంపూర్‌కాలనీ బస్టాండ్ వద్ద శుక్రవారం టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్, లాజిస్టిక్ మేనేజర్ బీ పాల్ ప్రారంభించారు. నస్పూర్ పట్టణంలోని శ్రీరాంపూర్ కాలనీ, తదితర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం కార్గో సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్గో సేల్స్ టీమ్ సభ్యులు సాయన్న, మహేశ్వర్, రమేశ్, టీసీసీ ఏజెంట్ ఆర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా మండలాధ్యక్షుడిగా సందేశ్‌రెడ్డి

బెల్లంపల్లి, ఆగస్టు 30 : ట్రస్మా (ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెతుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లి మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పైడాకుల రాజన్న, అధ్యక్షుడిగా సొల్లేటి సందేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాటిబండ రామకృష్ణ, గౌరవ సలహాదారుడిగా గొడుగుల సంజీవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు వీ సత్యనారాయణ, అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'పార్టీలకు అతీతంగా సేవ చేస్తా'

కాగజ్‌నగర్, ఆగస్టు 30 : పార్టీలకు అతీతంగా సేవ చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్ ఆలయ సమీపంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, తహసీల్దార్ కిరణ్ కుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మూడు రోజులు సెలవులు ఇవ్వాలి

నస్పూర్, ఆగస్టు 30 : పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకొని సెప్టెంబర్ 2 నుంచి మూడు రోజులు ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని కోరుతూ నేతకాని రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అనూష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆర్థిక చేయూత

మందమర్రి, ఆగస్టు 30 : హైదరాబాద్‌లో సోచ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు మందమర్రి పట్టణంలోని కార్మెల్ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులు విరాళాలుగా సేకరించిన రూ.35 వేలను పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యాసంస్థల డైరెక్టర్, ఫాదర్ జెవియర్ రెక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థితికి ఎదిగి, కళారంగంలో రాణిస్తున్నారన్నారు. అంధత్వం కన్న ఆత్మవిశ్వాసం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ పునరుద్ధరించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 30 : ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను వెంటనే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాపీ సంఘం భవనం నుంచి తహసీల్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ జ్యోత్స్న సమయానికి లేకపోవడంతో కలెక్టర్ కుమార్ దీపక్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చారని తెలుసుకొని, ఆయనకు వినతిపత్రం సమర్పించారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలానికి చెందిన మూడు వేల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి ఉపాధి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ఆన్‌లైన్ బుకింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

వేమనపల్లి, ఆగస్టు 30 : మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన సల్పాల శ్రీనివాస్‌కు మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు, రూ. 500 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేశ్ శుక్రవారం తీర్పునిచ్చారని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. గత మే 25న రాత్రి కల్మలపేట గ్రామానికి చెందిన నెండుగూరి రామన్న ఇంట్లో శ్రీనివాస్ చోరీకి పాల్పడ్డాడు. 14.75 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ.2,62,600 ఎత్తుకెళ్లాడు. బాధితుడు రామన్న నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా, నేరం రుజువుకావడంతో జడ్జి శిక్ష విధిస్తూ ర్పునిచ్చినటుల ఎస్ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మందమర్రి, ఆగస్టు 30 : మందమర్రి మండల పరిధిలోని బొక్కలగుట్ట గ్రామ సమీపంలో గల హెవెన్ ఆఫ్ పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి అండర్–14 బాలబాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రఘునాథరెడ్డి, పాల్‌విగ్, కెరోలినా, రాజయ్య, శ్రీనివాస్, సెరెన, దుబ్బ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

రెబ్బెన, ఆగస్టు 30 : గోలేటి గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, శుక్రవారం డీఆర్డీవో దత్తారావు, రెబ్బెన ఎంపీడీవో శంకరమ్మ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాగా, వారిని కలిసి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

యూడీఐఎస్‌ఈపై అవగాహన

దండేపల్లి, ఆగస్టు 30 : దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో యూడీఐఎస్‌ఈపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పాఠశాల మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల, విద్యార్థుల వివరాలు, పాఠశాల నిధుల గురించి చర్చించారు. కాంపెక్స్ హెచ్‌ఎంలు రాజు, చిన్న నర్సయ్య, విజయలక్ష్మి, శ్రీనివాస్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఐఎస్, సీసీవో, సీఆర్పీలు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి, ఆగస్టు 30: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, పాల్, వనం సత్యం పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు 30 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం గద్దెనెక్కి తొమ్మిది నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రమేశ్, ఆరెపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలు

కాగజ్‌నగర్, ఆగస్టు 30 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యాయంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి కరాటే, ఉషు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–17 బాలుర విభాగంలో ఏడుగురు, అండర్–17 బాలికల విభాగంలో ముగ్గురు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. పీడీ సాంబశివరావు, కోచ్‌లు రవి, దేవయ్య, ఏడుకొండలు, ప్రిన్సిపాల్ సాఫల్యా తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంక్షేమమే ముఖ్యం

లక్షెట్టిపేట, ఆగస్టు 30 : పిల్లల క్రమశిక్షణ, సంక్షేమమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. పట్టణంలోని గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యానారాయణ, ఇన్‌చార్జి వార్డెన్ శాభారాణి, సిబ్బంది ఉన్నారు.

గుడుంబా విక్రయదారుల బైండోవర్

మందమర్రి రూరల్, ఆగస్టు 30 : గుడుంబా తయారు చే సి, విక్రయిస్తున్న మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన భూక్యా శ్రీలత, బానోత్ ఉమ, రామకృష్ణపూర్‌కు చెందిన యశోద, శంకరమ్మను తహసీల్దార్ సతీశ్ కుమార్ ఎదుట బైడోవర్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ శారద ఆధ్వర్యంలో దాడులు చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆదిమ గిరిజనుల కోసం పీఎం జన్‌మన్

కెరమెరి, ఆగస్టు 30 : ఆదిమ గిరిజనుల(పీవీటీజీ) సమగ్ర అభివృద్ధే పీఎం జన్‌మన్ ఉద్దేశమని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆధార్, ఆయుష్మాన్ భారత్, జన్ ధన్ కేంద్రంను సందర్శించారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో పర్యవేక్షణలో అభియాన్‌పై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో ఖమర్ హుస్సేన్, ఎస్సీఈఆర్పీ చాహకటి శ్యాంరావ్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి

జైపూర్, ఆగస్టు 24 : ఎలక్ట్రోల్ ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యదర్శులకు డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎలక్ట్రోల్ ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండల కేంద్రంలోని కోటపల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల, కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల తరగతుల నిర్వహణ, భోజన వసతి, వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ప్రిన్సిపాల్ రమేశ్‌కు సూచించారు. ఎంపీడీవోసత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమారంలో పలు దుకాణాలకు జరిమానా..

భీమారం, ఆగస్టు 30 : భీమారంలోని వివిధ దుకాణాల వద్ద అపరిశుభ్రంగా ఉండగా, డీపీవో వెంకటేశ్వర్‌రావు జరిమానా విధించారు. లక్ష్మణ్ బైక్ గ్యారేజ్‌కు రూ.5 వేలు, సంతోషిమాత ఆటో స్టోర్, శ్రీరామ ఫర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీ ఫెర్టిలైజర్స్, బస్టాండ్ ప్రాంతంలో గల సంతోష్ కిరాణా దుకాణానికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ముందుగా జీపీని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి టీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే

జైపూర్, ఆగస్టు 30 : మండలంలోని బెజ్జాల గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ మానిరింగ్ కమిటీ సభ్యులు పాల్గొని, కార్యక్రమంపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సభ్యులు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ జిల్లపెల్లి వెంకటేశం, ఎస్‌డబ్ల్యూవో రవీందర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, ఆగస్టు 30 : మండలంలోని పొన్నారంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో తహసీల్దార్ పీ సతీశ్ కుమార్.. గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణపూర్ ఏఎస్ఐ వెంకన్న, ఆర్ఐ ఆర్ గణపతి రాథోడ్, పంచాయతీ కార్యదర్శి హరీశ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కిషోర్ కుమార్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ కమిటీ

దహెగాం, ఆగస్టు 30 : దహెగాం మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రేపెల్లి రాజయ్య, కార్యదర్శి వేముల రమేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా చంద్, మహిళా ఉపాధ్యక్షులుగా అనిత, కోశాధికారిగా ప్రశాంత్, సత్సంగ్ ప్రముఖ్‌గా శంకర్, గోసేవ ప్రముఖ్‌గా సత్యనారాయణ, ధర్మప్రసార ప్రముఖ్‌గా నారాయణ, ప్రచార ప్రముఖ్‌గా పరమేశ్వర్, గోరక్షక్ ప్రముఖ్‌గా ప్రదీప్, సహాయ ప్రముక్‌లుగా శ్రీనాథ్, రాజు, మల్లేశ్, సుమిత్, శ్రీనివాస్, విజయ్, గుండయ్య, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం

వేమనపల్లి, ఆగస్టు 30 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారులను గుర్తించి పనులను ప్రారంభించాలని, వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. కొత్తగా నర్సరీల కోసం స్థలాలను ఎంపిక చేయాలన్నారు. పంచాయతీ రికార్డులను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తాండూర్, ఆగస్టు 30 : ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని తాండూర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. రేచిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విరమణ పొందిన మహిళా ఉపాధ్యాయురాలు ప్రమీల రాణిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల నోడల్ అధికారి మల్లేశం, ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, జయప్రద, ఉపాధ్యాయులు సతీశ్ కుమార్, రవి, మంజుల, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, సంతోష్ కుమార్, నాగమణి, సావిత్రి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు 'ఆయూష్' మేలు

చెన్నూర్, ఆగస్టు 30: ఆరోగ్య సంరక్షణకు ఆయూష్ మందులే మేలని జిల్లా ఆయూష్ అధికారి రవీందర్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని ఆయూష్ దవాఖానలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురురికి మందులు అందించారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆయూష్ మందులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ మెడికల్ అధికారి సంసన్, సిబ్బంది కిరణ్, శ్రీధర్, ముజాఫర్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి బాసట

కోటపల్లి, ఆగస్టు 30 : కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో ఏతం రాజయ్యకు చెందిన రెండు ఎడ్లు గురువారం ఆకస్మికంగా మృతిచెందగా, ఆ రైతుకు గ్రామంలోని రైతులు బాసటగా నిలిచారు. అందరూ తోచిన విధంగా పోగుచేసిన రూ.49,700ను శుక్రవారం బాధిత రైతుకు అందచేశారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామంలోని రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడాన్ని అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

చింతలమానేపల్లి, ఆగస్టు 30 : పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ బొలెరోను మండలంలోని డబ్బా క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. మండలంలోని కర్జెల్లి నుంచి లక్షెట్టిపేట్‌కు అనుమతి లేకుండా తరలిస్తున్న నాలుగు ఎడ్లు, బొలెరో వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. డ్రైవర్ సయ్యద్ అజీముద్దీన్, తిరుపతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత

నస్పూర్, ఆగస్టు 30 : మంచిర్యాల పట్టణంలోని వీవీడీ సీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వర్ష.. జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో రాణించి అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అయితే ఈ పోటీలు జర్మనీలో జరుగనున్నాయి. ఈ విషయం తెలుసుకున్న నల్ల కోటమ్మ లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ నల్ల శంకర్‌గౌడ్ శుక్రవారం క్రీడాకారిణికి రూ.10 వేలు అందించారు. జర్మనీలో జరిగే క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

వైద్య శిబిరం విజయవంతం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30 : మంచిర్యాల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గర్మిళ్ల, హెల్పింగ్ హ్యాండ్ సహకారంతో రాష్ట్ర ఆటో ప్రణాళికా సంఘం చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ సారథ్యంలో రేకుర్తి కంటి దవాఖాన సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. 200 మందికి పరీక్షలు చేసి, 43 మందికి ఆపరేషన్ల ప్రక్రియ నిర్వహించినట్లు పేర్కొన్నారు. చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, వెంకటేశ్వర్లు, బెల్లంకొండ మురళి, అబ్దుల్ రహీం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.